క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకున్న అబ్బయ్యచౌదరి



కొండలరావుపాలెంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న అబ్బయ్యచౌదరి



ఓటేసిన కొఠారు రామచంద్రరావు

పెదవేగి : ప్రతి ఓటరు ఏ ప్రభుత్వాన్ని గెలిపించాలో ముందుగానే సిద్ధమయ్యారని వైఎస్సార్‌ సీపీ దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో సోమవారం ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నేత కొఠారు రామచంద్రరావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

ఓటేసిన జెడ్పీ చైర్‌పర్సన్‌

పెదపాడు: జెడ్పీ చైర్‌పర్సన్‌ ఘంటా పద్మశ్రీ తన స్వగ్రామమైన సత్యవోలులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం పోలింగ్‌ బూత్‌కు చేరుకుని ఆమె ఓటు వేసి ఓటర్లను ఉత్సాహ పరిచారు. ఆమె వెంట సర్పంచ్‌ రంభ ఉమామహేశ్వరి ఉన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి తమకు రాజ్యాంగం కల్పించిన హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్‌



బాబూఖాన్‌గూడెం పోలింగ్‌ కేంద్రం వద్ద రోడ్డుపై బారులు తీరిన ఓటర్లు

ఏలూరు రూరల్‌ : మండలంలో పోలింగ్‌ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్‌ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఇప్పటి వరకు పోలింగ్‌ కేంద్రాల వద్ద ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. 64 శాతం పోలింగ్‌ నమోదైందని, ఇది మరింత శాతం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సమయం పూర్తి అయినప్పటికీ శ్రీపర్రులో ఓటర్లు క్యూలో నిలబడ్డారు. చాటపర్రు, శ్రీపర్రు, గుడివాకలంక గ్రామాల్లో ఈవీఎం సిద్ధం చేయడంలో ఆలస్యమై పోలింగ్‌ సైతం 20 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమయ్యింది. కొమడవోలు పోలింగ్‌ భూత్‌లో ఏలూరు మేయర్‌ షేక్‌ నూర్జహాన్‌ భేగం, ఎస్‌ఎంఆర్‌ పెదబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ మంచెం మైబాబు ఓటు వేశారు. పలువురు వృద్ధులు సైతం వీల్‌చైర్‌లో పోలింగ్‌ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

టీడీపీ, జనసేన నేతల కవ్వింపు చర్యలు

పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌ సీపీ నాయకులపై దాడులకు తెగబడే ప్రయత్నం చేశారు. శ్రీపర్రు పోలింగ్‌ బూత్‌ వద్ద జనసేన, టీడీపీ నాయకులు హల్‌చల్‌ చేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో వైఎస్సార్‌ సీపీ నాయకుడు మండల కొండలరావు వారిని అడ్డుకున్నారు. లింగారావుగూడెం పోలింగ్‌ కేంద్రం వద్ద టీడీపీ నాయకులు చాటపర్రు సర్పంచ్‌ కొరపాటి శ్రీరామ్‌ ప్రభుదేవ్‌తో పాటు పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులను రెచ్చగొట్టారు. ఇదేమని ప్రశ్నించిన సర్పంచ్‌ బాబాయ్‌పై దాడిగి తెగబడ్డారు. జాలిపూడి, మాదేపల్లి పోలింగ్‌ కేంద్రాల వద్ద టీడీపీ, జనసేన నాయకులు పదేపదే వైఎస్సార్‌ సీపీ నాయకులను బూతులు తిడుతూ రెచ్చగొట్టారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు సంయమనం పాటించి ఓటింగ్‌ ప్రశాంతంగా జరిగేలా చేశారు. ఈ సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో టీడీపీ, జనసేన శ్రేణులు అక్కడ నుంచి జారుకున్నారు.

ఈవీఎంల మొరాయింపు



మస్తాన్‌ మన్యం కాలనీ ఎంపీయూపీ స్కూల్‌లో పోలింగ్‌ బూత్‌ వద్ద ఓటర్ల నిరీక్షణ

ఏలూరు (టూటౌన్‌): కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌ సోమవారం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. వెంకటాపురం పరిధిలోని మస్తాన్‌ మన్యం కాలనీ ఎంపీయూపీ స్కూల్‌లో ఉదయం 8 గంటల వరకు ఈవీఎంలు పనిచేయకపోవడంతో ఓటర్లు అవస్థలు పడ్డారు. దీంతో పెద్ద ఎత్తున క్యూ లైన్‌ ఏర్పడింది. 28వ డివిజన్‌ తంగెళ్లమూడిలోని బీడీ కాలనీలో ఎంపీయూ స్కూల్‌లో 14వ నెంబరు బూత్‌లో ఈవీఎం నెమ్మదిగా పనిచేసింది. సాయంత్రం 6 గంటలు తరువాత కూడా ఈ బూత్‌ వద్ద పెద్ద సంఖ్యలో ఓటర్లు బారులుతీరిన పరిస్థితి కనిపించింది.

పోలింగ్‌కు పోటెత్తారు



ఏలూరు శ్రీరామ్‌నగర్‌ పోలింగ్‌ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



మత్స్యశాఖ కార్యాలయ పోలింగ్‌ కేంద్రంలో కమిషనర్‌ వెంకటకృష్ణకు సూచనలిస్తున్న కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌



ఏఎంసీ పోలింగ్‌ కేంద్రంలో ఓటేసిన మేయర్‌ దంపతులు నూర్జహాన్‌ పెదబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ మైబాబు



శ్రీరామవరంలో పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌



ఏలూరు గాంధీ నగర్‌ స్కూల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఏలూరు టౌన్‌: సార్వత్రిక ఎన్నికలు ఏలూరు నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్‌ కేంద్రాల వద్ద బారులు తీరారు. మహిళలు, వృద్ధులు భారీ సంఖ్యలో పోలింగ్‌ కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్‌ ముగిసే సమయానికి కొన్ని కేంద్రాల్లో బారులు తీరిన ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బారులు తీరిన మహిళలు

ఏలూరు ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవటానికి పోలింగ్‌ కేంద్రాలకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఒకవైపు భానుడు ప్రతాపం చూపుతున్నా, పట్టించుకోకుండా పోలింగ్‌ కేంద్రాల వద్ద మహిళలు సైతం బారులు తీరారు. ఉదయం ఏడు గంటల నుంచీ పోలింగ్‌ కేంద్రాల వద్ద రద్దీ పెరిగింది. ఈవీఎంల్లో జాప్యం అవుతున్నా ఓపిగ్గా ఓటు వేసేందుకు వారు వేచి ఉన్నారు. అవ్వాతాతలు కూడా ఉదయాన్నే పోలింగ్‌ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు.

యువతలో ఉత్సుకత

ఏలూరు నగరంలోని యువత, కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు మొదటిసారి వినియోగించుకునేందుకు ఉత్సుకత చూపించారు. కుటుంబాల వారీగా వచ్చి మరీ ఓటు వేయటం విశేషం. తొలిసారి తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్న తమ పిల్లలను వెంట బెట్టుకుని మరీ తీసుకువచ్చారు. యువత ఎండలోనూ క్యూలైన్లలో నిలుచుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతీ పోలింగ్‌ బూత్‌లోనూ పదుల సంఖ్యలో యువత ఉండడం విశేషం.

ఓటు హక్కు వినియోగించుకున్నాం

ఏలూరు సత్రంపాడుకు చెందిన స్మైలీ విద్యాని బీ ఫార్మసీ చదువుతోంది. మొదటిసారి ఆమెకు ఓటు హక్కు రావటంతో ఓటు వేసేందుకు ఆసక్తి చూపింది. తీవ్రమైన ఎండవేడిలోనూ క్యూలైన్లలో నిలుచుని మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు వేయటం క్రేజీగా ఉందని సంతోషం వ్యక్తం చేసింది. ఏలూరు ఆర్‌ఆర్‌పేట సుబ్బమ్మదేవి స్కూల్‌ పోలింగ్‌ కేంద్రంలో హారిక అనే విద్యార్థిని సైతం తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంది. గొంతిన రామకృష్ణ తన కుటుంబంతో పాటు పోలింగ్‌ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఓటు వేశారు. ఏలూరు వన్‌టౌన్‌ ప్రాంతానికి చెందిన షేక్‌ నియాజ్‌ ఓటు హక్కు వినియోగించుకునేందుకు దుబాయ్‌ నుంచి ఏలూరు వచ్చాడు. సీఎం జగన్‌ అన్న కోసం ఓటు వేయాలనే కోరికతో వచ్చి ఓటు వేశాడు.

పటిష్టమైన భద్రతా చర్యలు

ఏలూరులో పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఏలూరు నియోజకవర్గంలో 212 పోలింగ్‌ బూత్‌లు ఉండగా ప్రతి బూత్‌ వద్దా ఇద్దరు పోలీస్‌ కానిస్టేబుల్స్‌, నలుగురు సాయుధ బలగాల గార్డ్స్‌ను నియమించారు. మొబైల్‌ బృందాలు, ఎస్సైలతో కూడిన మరో బృందంతోపాటు సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ నిత్యం పోలింగ్‌ బూత్‌లను, పరిసరాలను పర్యవేక్షిస్తూ గొడవలను అరికట్టారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ప్రతి పోలింగ్‌ స్టేషన్‌కు వెళుతూ శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

ఏలూరు నియోజకవర్గంలో ఓటింగ్‌ ప్రశాంతం

- సాయంత్రం 6 గంటలకు 66.25 శాతం నమోదు
- ఓటేసిన 1,55,921 మంది
- సమయం ముగిసిన తర్వాత 70 బూత్‌లలో కొనసాగిన పోలింగ్‌

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు నియోజకవర్గంలో పోలింగ్‌ 66.25 శాతంగా నమోదైంది. ఉదయం 7 గంటలకు ముందే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్‌ బూత్‌లకు చేరుకున్నారు. కొన్ని బూత్‌లలో ఈవీఎంలు మొరాయించటంతో సుమారు అరగంట నుంచి గంట ఆలస్యంగా పోలింగ్‌ ప్రారంభమైంది. వృద్ధులు, దివ్యాంగులు ఉదయం 9 గంటల లోపుగానే పోలింగ్‌ బూత్‌లకు చేరుకున్నారు. కాగా నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్‌ బూత్‌లలో సాయంత్రం 6 గంటలు ముగిసినా క్యూలైన్‌లో ఓటర్లు వేచిఉండడంతో వారందరికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఆయా బూత్‌లలో రాత్రి 8 నుంచి 9 గంటల వరకు పోలింగ్‌ కొనసాగింది. కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న బడేటి చంటితో పాటు పోలింగ్‌ బూత్‌లలో పర్యటించిన జనసేన నాయకుడు రెడ్డి అప్పల నాయుడు క్యూల్లో నుంచున్న ఓటర్లకు సైకిల్‌ గుర్తును కాక గ్లాస్‌ గుర్తుకు ఓటు వేయాలని సూచించడం కనిపించింది. ఆయన సూచనలతో కొందరు ఓటర్లు ఏలూరు ఎన్నికల బరిలో నిలిచిన మత్తేబాబి అనే అభ్యర్థికి కేటాయించిన గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేశారని చర్చించుకున్నారు.



ఏలూరు వన్‌టౌన్‌ బాలగంగాధర్‌తిలక్‌ పోలింగ్‌ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఓటేసిన ప్రముఖులు

నియోజకవర్గంలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్‌ వె.ప్రసన్న వెంకటేష్‌ స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో, వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని స్థానిక శ్రీరామ్‌ నగర్‌ ఎంపీపీ పాఠశాలలో, నగర మేయర్‌ షేక్‌ నూర్జహాన్‌ పెదబాబు దంపతులు ఏఎంసీ కార్యాలయంలో ఓటేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి పవర్‌పేట ఎంపీయూపీ స్కూల్‌లో ఓటేశారు. కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు వెంకట్రావుపేట పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ సంప్రదాయ దుస్తుల్లో ఎన్నికల సరళి పరిశీలనకు రావడంతో పాటు తన ఓటు హక్కును అదే సంప్రదాయ దుస్తుల్లో స్థానిక కట్టాసుబ్బారావు తోటలోని మున్సిపల్‌ స్కూల్‌లో వినియోగించుకున్నారు.

6 గంటలకు 66.25 శాతం ఓటింగ్‌

ఏలూరు నియోజకవర్గంలో సాయంత్రం 6 గంటలు ముగిసే సరికి 66.25 శాతం ఓటింగ్‌ నమోదైంది. ఏలూరు నియోజకవర్గంలో మొత్తం 2,35,345 మంది ఓటర్లు ఉండగా పోలింగ్‌ ప్రారంభమైన ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య 25,283 మంది ఓటేశారు. పోలింగ్‌ 10.74 శాతంగా నమోదైంది. ఉదయం 11 గంటలకు 24.96 శాతంతో 58,732 మంది, మధ్యాహ్నం ఒంటి గంటకు 38.04 శాతంతో 89,531 మంది, మధ్యాహ్నం 3 గంటలకు 54.22 శాతంతో 1,27,597మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా సాయంత్రం 5 గంటలకు 64.59 శాతంతో 152017 మంది, సాయంత్రం 6 గంటలకు 66.25 శాతంతో 1,55,921 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.



హారిక, కొత్త ఓటర్‌



స్మైలీ విద్యానీ, కొత్త ఓటర్‌





దుబాయ్‌ నుంచి వచ్చి ఓటేసిన షేక్‌ నియాజ్‌ , ఏలూరు కేపీడీటీ స్కూల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



దెందులూరు మండలం తాళ్లగూడెంలో చేతులుపై వృద్ధురాలిని తీసుకొస్తున్న దృశ్యం



సత్రంపాడులో వృద్ధురాలిని వీల్‌చైర్‌తో తీసుకువెళుతున్న సహాయకులు



ఏలూరు సుబ్బమ్మదేవి స్కూల్‌ పోలింగ్‌ కేంద్రం వద్ద యువకుడిని తీసుకొస్తున్న దృశ్యం



మాదేపల్లి పోలింగ్‌ కేంద్రానికి వీల్‌చైర్‌పై వచ్చి ఓటు వేసిన వృద్ధుడు

దెందులూరులో బారులుతీరిన ఓటర్లు



గోపన్నపాలెంలో పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



దెందులూరు పోలింగ్‌ కేంద్రంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో పార్లమెంట్‌, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి భారీగా పోలింగ్‌ నమోదయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు భారీగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 6.45 గంటలకే పోలింగ్‌ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కొవ్వలి, దెందులూరు ఇతర గ్రామాల్లో స్వల్ప ఘర్షణలయ్యాయి. నియోజకవర్గ రిటర్నింగ్‌ ఆఫీసర్‌, జాయింట్‌ కలెక్టర్‌ బీ లావణ్యవేణి పర్యవేక్షణలో నూజివీడు డీఎస్పీ శ్రీనివాసులు, పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్‌, దెందులూరు ఎస్సై కె.స్వామి ఘర్షణను శాంతింపజేశారు. తాళ్లగూడెంలో నడవలేని వృద్ధురాళ్లను కుటుంబ సభ్యులు ఎత్తుకుని పోలింగ్‌ స్టేషన్లకు తీసుకువచ్చారు. పోలింగ్‌ స్టేషన్ల ఎదుట బారికేడ్లు, టెంట్లు, వైద్యసదుపాయం ఏర్పాటు చేశారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్‌ స్టేషన్‌లో గడువు ముగిసే సరికి ఉన్నవారికి ఓటు వేసుకునే అవకాశం కల్పించారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పరిశీలన

వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ సీతంపేట, శ్రీరామవరం గ్రామాల్లోని పోలింగ్‌ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నానితో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు, గోపన్నపాలెం గ్రామాల్లో పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు.

దూరప్రాంతాల నుంచి తరలివచ్చిన ఓటర్లు

దెందులూరు నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వివిధ వృత్తులు, ఉపాధి కోసం వెళ్లిన వారు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోమవారం దెందులూరుకు తరలివచ్చారు. వివిధ గ్రామాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జాయింట్‌ కలెక్టర్‌, ఆర్వో పరిశీలన

జిల్లా జాయింట్‌ కలెక్టర్‌, రిటర్నింగ్‌ అధికారి బీ లావణ్యవేణి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పోలింగ్‌ సరళిని, పోలింగ్‌ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో నమోదైన పోలింగ్‌ గణాంకాలను లెక్కిస్తున్నారు



కుటుంబంతో కలిసి ఓటేసిన గొంతిన రామకృష్ణ



కస్తూరిబా స్కూల్‌ పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



ఏలూరు కేపీడీటీ స్కూల్లో ఓటు వేసేందుకు ఐడీ చూపిస్తున్న మహిళలు



పోలింగ్‌ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరం



సత్రంపాడులో పోలింగ్‌ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరం



ఏలూరు ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ డి.మేరీప్రశాంతి



బాలగంగాధర్‌తిలక్‌ పోలింగ్‌ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలు



ఏలూరు గాంధీనగర్‌ స్కూల్లో ఓటు వేసేందుకు వస్తున్న మహిళ